సాక్షి
సిద్దిపేట

సోమవారం । 13 । జనవరి । 2025

సాగు వినూత్నం.. లాభాలు అధికం

ఉమ్మడి మెదక్ జిల్లా రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించడంలో అదరహో అనిపిస్తున్నారు. పంటమార్పిడిలో భాగంగా కూరగాయలు, పండ్ల తోటల సాగుపై దృష్టి సారిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జిస్తున్నారు. తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. సేంద్రియంలో కూరగాయలు, పండ్ల సాగు చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. వినూత్నమైన, ఆధునిక పద్ధతలతో సాగు చేస్తున్న కొందరి రైతన్నల కథనాలు.. 8లో..



న్యూస్‌రీల్

నేటి నుంచి సిటీ పోలీస్ యాక్టు

సిద్దిపేటకమాన్: పోలీసు కమిషనరేట్ పరిధిలో సోమవారం నుంచి సిటీ పోలీస్‌యాక్టు అమలులో ఉంటుందని సీపీ అనురాధ తెలిపారు. ఈ నెల 28వ తేదీ వరకు నిబంధనలు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. పోలీసుల ముందస్తు అనుమతులు లేకుండా ఎలాంటి ధర్నాలు, సభలు, సమావేశాలు, రాస్తారోకోలు నిర్వహించరాదని తెలిపారు. అలాగే సౌండ్ వినియోగంపై ఉన్న నిషేధాజ్ఞలు కూడా కొనసాగుతాయన్నారు.

మున్సిపల్ అభివృద్ధికి కృషి

ఎంపీ రఘునందన్ రావు



ప్రొసీడింగ్ కాపీని అందిస్తున్న ఎంపీ

దుబ్బాకటౌన్: మున్సిపల్ అభివృద్ధికి కృషి చేస్తానని, అందులో భాగంగానే చెల్లాపూర్ 3వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీ ల్యాండ్స్ నుంచి రూ.10లక్షలనిధులను మంజూరు చేసినట్లు ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. ఆదివారం దుబ్బాకలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో నిధుల మంజూరుకు సంబంధించిన ప్రొసీడింగ్ పత్రాలను చెల్లాపూర్ 3వ వార్డు కౌన్సిలర్ మల్లారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా పూర్తి స్థాయిలో సహకరిస్తానన్నారు. 3వ వార్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ఎంపీకీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు కౌన్సిలర్ చెప్పారు.

వారి త్యాగాలు వెలకట్టలేనివి

డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి



కేక్ కట్ చేస్తున్న నర్సారెడ్డి, నాయకులు

గజ్వేల్: ఇందిరాగాంధీ కుటుంబం దేశ ప్రజల కోసం చేసిన త్యాగాలు వెలకట్టలేనివని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ జన్మదిన వేడుకలను ఆదివారం గజ్వేల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ ఇందిరాగాంధీ ఆశయాలను కొనసాగిస్తూ సోనియాగాంధీ ప్రజలకు మరింత చేరవయ్యారని కొనియడారు. అదేబాటలో ప్రియాంకగాంధీ, రాహుల్ గాంధీలు పయనిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు బండ మల్లన్న జాతర




జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసులు

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలో వెలసిన మల్లన్న బండపై ఈ నెల 14న జాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. జాతర నేపథ్యంలో జరుగుతున్న ఏర్పాట్లను ఆదివారం సీఐ శ్రీనివాస్, భూంపల్లి ఎస్‌ఐ హరీశ్‌తో కలిసి పరిశీలించారు. సీఐ మట్లాడుతూ.. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముగ్గురు ఎస్‌ఐలతో పటిష్టమైన బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు.

సంబురాల సంక్రాంతి

మూడు రోజుల ముచ్చటైన పండుగ



సిద్దిపేట పట్టణంలో గంగిరెద్దు విన్యాసం

ఉత్సవంలా జరుపుకొనే సంక్రాంతి రానే వచ్చింది.. ఇంటింటా సంబురాలు తీసుకొచ్చింది. జిల్లా అంతటా పండుగ శోభ సంతరించుకుంది. కొత్త ధాన్యం ఇంటికి చేరిన వేళ.. రైతులు సంతోషంగా నిర్వహించే అతిముఖ్యమైన పండుగ సంక్రాంతి. అందమైన ముగ్గులు, బొమ్మల కొలువులు, గొబ్బెమ్మలతో కనువిందు చేయనున్నాయి. డూడూ బసవన్నల రాకపోకలతో ఊరూవాడతో సందడి నెలకొంది. పట్టణాలు, నగరాల్లో ఉన్న వారు స్వస్థలాలకు వచ్చేశారు. కొత్త అల్లుళ్లు, బంధుమిత్రులతో ఇళ్లన్నీ కళకళలాడుతున్నాయి. పిండివంటలు చేయడంలో మహిళలు నిమగ్నమయ్యారు. పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో చిన్నారులు గాలిపటాలతో హుషారుగా గడుపుతున్నారు. మొదటి రోజు భోగి, రెండో రోజు సంక్రాంతి, మూడో రోజు కనుమ పండుగ నిర్వహిస్తారు.

- నేడు భోగి, రేపు సంక్రాంతి, ఎల్లుండి కనుమ
- వాకిళ్లలో ఆకట్టుకోనున్న రంగవల్లులు
- ప్రతి ఇంటా పిండివంటల ఘుమఘుమలు
- పతంగులతో చిన్న, పెద్దల సందడి
- ఇంటింటా బంధుమిత్రుల హడావుడి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా వ్యాప్తంగా పట్టణాలు, గ్రామాలు మూడు రోజుల పండుగకు ముస్తాబయ్యాయి. రంగవల్లికలకు అవసరమయ్యే రంగులు, ముగ్గులలో వేసే రేగుపళ్లు, పూలు, నవ ధాన్యాల విక్రయాలతో మార్కెట్లలో సందడి నెలకొంది. సంక్రాంతి పండుగ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి జిల్లాకు గంగిరెద్దులు వచ్చాయి. వీటిని అందంగా అలంకరించి పట్టణాలతో పాటు, గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ విన్యాసాలు చేయిస్తున్నారు. ఈ ఏడాది అత్యధికంగా గంగిరెద్దులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి వచ్చాయి.

రంగువల్లులతో..

పండుగ వేళ ప్రతి ఇంటి ముంగిట వేసే రంగవల్లులకు అవసరమయ్యే రంగులను పట్టణాలలోని ప్రధాన వీధుల్లో విక్రయిస్తున్నారు. ప్రతి రంగు ప్యాకెట్ రూ.10కి విక్రయిస్తున్నారు. కొనుగోళ్లతో సందడి నెలకొంది. పండుగకు ముందునుంచే ముగ్గుల పోటీలను ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలు నిర్వహిస్తుండటంతో ఎక్కడ చూసినా రంగవల్లులు కనివిందు చేస్తున్నాయి.



సిద్దిపేట పట్టణంలో పతంగుల దుకాణం వద్ద సందడి



పతంగుల రెపరెపలు

చిన్నారులు, పెద్దలు అనే తేడా లేకుండా అందరూ పతంగులను ఎగురవేస్తున్నారు. ఆకాశం వైపు చూస్తే రంగు రంగుల పతంగులే కనువిందు చేస్తున్నాయి. వీటిని విక్రయించే దుకాణాల వద్ద సందడి నెలకొంది. కైట్‌లు రూ.10 నుంచి రూ.1000 వరకు ధర పలుకుతున్నాయి.

ఇంటింటా పిండి వంటలు



ఏ ఇంట్లో చూసిన పిండి వంటల ఘుమఘుమలే.. పండుగకు ప్రత్యేకమైన సకినాలు, గారెలు, అరిసెలు తదితర పిండి వంటకాలు సిద్ధం చేశారు. శీతాకాలంలో ఈ పిండి వంటకాలు ఆరోగ్యానికి ఎంతో విశిష్టమైనవి. పిండి వంటకాల తయారీలో తల్లులు, అమ్మమ్మ, నానమ్మలు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.

ఆలయాల ముస్తాబు..



జిల్లాలోని దేవాలయాలు సంక్రాంతికి ముస్తాబయ్యాయి. అన్ని శైవ, వైష్ణవ ఆలయాలు విద్యుత్ కాంతులతో, వివిధ పూల అలంకరణలతో దర్శనమిస్తున్నాయి. పలు ఆలయాలలో గోదాదేవి–రంగనాయకుల కల్యాణాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. దీంతో ఆలయాలకు భక్తుల తాకిడి పెరిగింది.

కనులపండువగా గోదాదేవి కల్యాణం



స్వామివార్లకు తలంబ్రాలు పోస్తున్న అర్చకులు

దుబ్బాకటౌన్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన దుబ్బాక పట్టణంలోని బాలాజీ దేవాలయంలో ఆదివారం గోదాదేవి సమేత రంగనాయక స్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. ఉదయం నుంచే స్వామివారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణానికి భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. దాదాపు 50 మంది పెళ్లికాని యువతీయువకులకు స్వామి వారి జీలకర్ర బెల్లాన్ని ప్రసాదంగా ఇచ్చారు. అనంతరం ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్యతదితర న్యాకులు దర్శించుకున్నారు.

మల్లన్న క్షేత్రంలో భక్తుల సందడి



కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ పరిసరాలన్నీ కిటకిటలాడాయి. స్వామి దర్శనానికి తెల్లవారుజామునుంచే భక్తులు బారులు తీరారు. కొంత మంది భక్తులు స్వామివారికి ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కొండపైన ఉన్న ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఆలయ ఈఓ రామాంజనేయులు, ఆలయ ప్రధానార్చకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. - కొమురవెల్లి(సిద్దిపేట)

‘వివేక’మే స్ఫూర్తి పథం కావాలి

ఎమ్మెల్యే హరీశ్‌రావు

- బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకులతో సమీక్ష



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: స్వామి వివేకానంద స్ఫూర్తితో నేటి యువత ముందుకు సాగాలని, ఆయన ఆశయాలను కొనసాగించాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం వివేకానంద జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... స్వామి వివేకానంద తన ప్రసంగాలతో భారత జాతిని మేల్కొలిపినట్లు పేర్కొన్నారు. దేశ యువతలో ఆత్మ విశ్వాసం నింపి, కర్తవ్యాన్ని బోధించిన గొప్ప వ్యక్తిగా అభివర్ణించారు.

రాజకీయాల్లో కీలకపాత్ర ..

యువత రాజకీయాల్లో కీలకమైన పాత్ర పోషించాలని హరీశ్‌రావు సూచించారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో చిన్నకోడూర్ మండల బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వారికి దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసిన మోసం, హామీల వైఫల్యం గూర్చి ప్రజల్లో చైతన్యం తేవాలని సూచించారు. మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని, కేసీఆర్ పథకాలను బంద్ చేసిందని ప్రజలకు అర్థం అయ్యేలా వివరించాలని సూచించారు. పదేళ్లు సిద్దిపేట అన్ని రంగాల్లో ప్రగతి పథంలో ముందుకు సాగిందని అన్నారు. ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలన్నారు. రాబోయే రోజుల్లో యువతకు సముచిత స్థానం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వెంకటాపూర్ బీరప్ప దేవాలయం నిర్మాణానికి హరీశ్‌రావు రూ.లక్ష విరాళం అందించారు. సమావేశంలో నాయకులు రాజనర్స్, సాయిరాం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మెజార్టీ స్థానాలు గెలుద్దాం

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక స్థానాలు గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ అన్నారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో నారాయణరావుపేట మండల స్థాయి నాయకుల, కార్యకర్తల సమావేశంలో హరికృష్ణ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంలో తీసుకువచ్చిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను గ్రామాల్లో ప్రతి ఇంటికీ తీసుకెళ్లి వివరించాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత బస్సు సౌకర్యం, ఉచిత కరెంటు, 50వేలకు పైగా ఉద్యోగ కల్పన, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు తదితర పథకాల లబ్ధిదారులను కలవాలన్నారు. పదేళ్లుగా గ్రామాల్లో అభివృద్ధి పడకేసిందన్నారు. బీఆర్‌ఎస్ తమ ఉనికి కోసమే ధర్నాలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు పాండు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చింతల రాజ్‌వీర్ తదితరులు ఉన్నారు.

మతిస్థిమితం లేని మహిళపై గ్యాంగ్ రేప్

- అంబేడ్కర్ విగ్రహం సాక్షిగా అఘాయిత్యం
- గేదె కోసం సీసీఫుటేజీలో వెతుకుతుండగా వెలుగుచూసిన దారుణం



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

వెల్దుర్తి/చేగుంట(తూప్రాన్): జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. మతిస్థిమితంలేని మహిళపై ముగ్గురు ఆగంతకులు అత్యాచారానికి పాల్పడ్డారు. మాసాయిపేట మండలం రామంతాపూర్‌లో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహం సాక్షిగా ఈ దారుణం జరిగింది. సీఐ వెంకటరాజాగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్‌కు చెందిన భవాని స్వామి వ్యవసాయంతో పాటు పాడి పశువులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గేదెలను ప్రతిరోజూ గ్రామ శివారులోని లింగారెడ్డిపల్లికి వెళ్లే దారిలో గల తన వ్యవసాయ పొలం వద్ద కట్టేసి ఇంటికి వెళ్తుంటాడు. ఈ క్రమంలో ఈనెల 8వ తేదీన ఉదయం వెళ్లి చూసేసరికి పశువుల పాకలోని ఐదు గేదెలు కనిపించకుండాపోయాయి. చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో ఈనెల 9వ తేదీన చేగుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి బాధిత కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు గ్రామ శివారులోని ఓ దాబా వద్ద ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలించారు. ఈనెల 8న ఉదయం 2 గంటల నుంచి 5 గంటల మధ్య దాబాను ఆనుకొని ఉన్న అంబేడ్కర్ విగ్రహం వెనుక నిద్రించి ఉన్న మతిస్థిమితం లేని మహిళపై ముగ్గురు అత్యాచారానికి పాల్పడిన వీడియోలు గుర్తించారు. గ్రామస్తుల ఫిర్యాదుతో రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్, చేగుంట ఎస్‌ఐ చైతన్యరెడ్డి సంఘటనాస్థలాన్ని పరిశీలించి దాబా నుంచి సీసీ ఫుటేజీని సేకరించారు. అత్యాచారానికి గురైన మహిళ గత కొన్ని రోజులుగా దాబా పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేస్తూ కాలం వెళ్లదీస్తున్నట్లు తెలిసింది. రాత్రి పూట జాతీయ రహదారి 44 పక్కన లింగారెడ్డిపల్లికి వెళ్లే దారిలో గల అంబేడ్కర్ విగ్రహం వెనక గద్దెపై నిద్రిస్తుంది. ఈ క్రమంలోనే ముగ్గురు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఈ దారుణానికి పాల్పడ్డారు. గ్యాంగ్‌రేప్‌కు పాల్పడిన నిందితులను త్వరలోనే అరెస్ట్ చేస్తామని పోలీసులు ప్రకటించిన ప్పటికీ.. శనివారం రాత్రే వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ దారుణానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.


తెరపైకి పోలీస్ అవుట్‌పోస్ట్!

- సీసీ కెమెరాల వ్యవస్థ పునరుద్ధరణ
- కొండపోచమ్మ సాగర్ వద్ద తొలినాళ్లలో కొనసాగిన రక్షణ చర్యలు
- ఎత్తివేతతో పరిస్థితి దయనీయం
- సూచిక బోర్డులు కూడా కరువు
- మల్లన్నసాగర్‌లోనూ ఇదే దుస్థితి
- ఫలితంగా కొనసాగుతున్న ప్రమాదాల పరంపర

గజ్వేల్: కొండపోచమ్మ సాగర్ విషాదం.. జలాశయాల వద్ద పోలీస్ అవుట్ పోస్ట్, నామమాత్రంగా ఉన్న సీసీ కెమెరాల వ్యవస్థ పునరుద్ధరణ, సూచిక బోర్డుల ఏర్పాటు అంశాలను తెరపైకి తెస్తున్నది. ఈ రిజర్వాయర్‌ను ప్రారంభించిన తొలినాళ్లలో ఉన్న రక్షణ చర్యలు నేడు పూర్తిగా కనుమరుగవటం వల్లే ప్రమాదాల పరంపర కొనసాగుతున్నదనే చర్చ అంతటా కొనసాగుతున్నది. ఈనేపథ్యంలో ప్రభుత్వం చేపట్టే చర్యలపైనే అందరి దృష్టి కేంద్రీకృతమై ఉన్నది. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవ ఫలితంగా మర్కూక్ మండల కేంద్రంలో కొండపోచమ్మసాగర్ జలాశయం నిర్మాణం జరిగింది. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మించిన ఈ రిజర్వాయర్‌లోకి మేడిగడ్డ నుంచి ఎత్తిపోతల ద్వారా వివిధ బ్యారేజీలు, రిజర్వాయర్ల మీదుగా జిల్లాలోని రంగనాయక్‌సాగర్, మల్లన్నసాగర్ ద్వారా కొండపోచమ్మసాగర్‌లోకి గోదావరి జలాలు వస్తున్నాయి. నగరానికి కొండపోచమ్మసాగర్ సమీపంలో ఉండటం వల్ల అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నది. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట నుంచి సిద్దిపేట, ఉమ్మడి కరీంనగర్ జిల్లామీదుగా మంచిర్యాల ప్రాంతం వరకు 207కిలోమీటర్ల మేర రాజీవ్ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించి ఉంది. ఈ రహదారి గ్రేటర్ చుట్టూ నిర్మించి ఉన్న ఔటర్ రింగు రోడ్డు అనుసంధానంతో చేయడం వల్ల దేశంలోని అన్ని రాష్ట్రాల రోడ్లను చేరుకునే అవకాశం కలిగింది. అంతేకాకుండా వరంగల్ హైవే, నిజామాబాద్‌వైపు వేళ్లే 44 నంబర్ జాతీయ రహదారితో ఈ రోడ్డును అనుసంధానం చేశారు. ఫలితంగా పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతూవస్తున్నది.

సీసీ కెమెరాల వ్యవస్థ నామమాత్రం

ప్రత్యేకించి కొండపోచమ్మసాగర్‌కు సెలవు రోజుల్లో సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. రిజర్వాయర్‌ను ప్రారంభించిన తొలి నాళ్లల్లో ఇక్కడ పోలీస్ అవుట్ పోస్ట్ కొనసాగింది. అలాగే సీసీ కెమెరాల వ్యవస్థ పటిష్టంగా పనిచేసేలా చర్యలు తీసుకున్నారు. సందర్శకులు ఎవరూ వచ్చిన వివరాలు తెలుసుకున్నాకే అనుమతి ఇచ్చేవారు. అంతేకాకుండా జలశయం వద్ద వెళ్లే సందర్బంలో జాగ్రత్తలను వివరించే వారు. రానురానూ ఈ వ్యవస్థలను ఎత్తేశారు. సీసీ కెమెరాల నామమాత్రంగానే ఉన్నది. ఏడాదిన్నరగా ఇక్కడ రక్షణ చర్యలు గాలిలో దీపంలా మారాయి. రిజర్వాయర్‌పైకి ఎవరుపడితే వారు జలాశయంలోకి నేరుగా దిగుతున్నారు. జలాశయంలోకి దిగితే ప్రమాదం పొంచి ఉన్నదనే సూచిక బోర్డులు కూడా కరువయ్యాయి.



కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్

ఎత్తును గుర్తించడంలో తికమక

కొండపోచమ్మసాగర్‌లో ఎత్తును గుర్తించడంలో సందర్శకులు తికమకపడుతున్నారు. నిజానికి ఈ జలాశయం ముందుభాగంలో కట్ట ఎత్తు 40మీటర్ల ఉండగా, వెనుక భాగం కేవలం 12మీటర్ల ఎత్తులో మాత్రమే ఉన్నది. ప్రస్తుతం ఇందులో 9.4టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. వెనుకభాగం కేవలం 12మీటర్ల ఎత్తులో మాత్రమే ఉండటం వల్ల నీళ్ల తక్కువగా కనిపిస్తాయి. ఈ రాతి కట్టల ద్వారా నడుచుకుంటూ వెళ్తున్న సందర్శకులు అక్కడి నుంచి పక్కనే లోతుగా గుంతల్లోకి జారి పడి ప్రాణాలు కోల్పోతున్నారు. తాజాగా శనివారం నాటి ఇలాగే జరిగింది. ఆయా ప్రదేశాల్లో జాగ్రత్తలు సూచించే బోర్డులను వెంటనే ఏర్పాటు చేయాల్సి ఉన్నది. మల్లన్నసాగర్‌లోనూ కట్టనుంచి ముందు భాగం 60మీటర్ల ఎత్తులో ఉండగా, వెనుక భాగం 15మీటర్లలో ఉంటుంది. ఈ జలాశయంలో ఇదే తరహాలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ రెండు జలాశయాల వద్ద పోలీస్ అవుట్‌పోస్ట్‌తో పాటు సూచిక బోర్డుల ఏర్పాటు, నామమాత్రంగా ఉన్న సీసీ కెమెరాల వ్యవస్థను పటిష్టతకు వెంటనే చర్యలు చేపట్టాల్సి ఉంది. ఈ అంశంపై గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి ‘సాక్షి’తో మాట్లాడుతూ కొండపోచమ్మసాగర్ వద్ద భద్రతకు అవసరమైన కార్యాచరణపై చర్చిస్తున్నామని చెప్పారు. త్వరలోనే అధికారికంగా వివరాలు తెలియజేస్తామన్నారు.

క్లుప్తంగా

యువతకు దిక్సూచి స్వామి వివేకానంద


వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి తదితరులు

గజ్వేల్‌రూరల్: యువతకు దిక్సూచి స్వామి వివేకానందుడని, ఆయన చూపిన మార్గంలో యువత పయనించి దేశాభివృద్ధికి పాటుపడాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పిలుపునిచ్చారు . ఆదివారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని గజ్వేల్‌లో ఉన్న ఆయన విగ్రహానికి గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, యువజన సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేశబోయిన నర్సింహులుతో కలిసి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం గజ్వేల్ ప్రాంతంలో వివిధ రంగాల్లో ప్రతిభను చాటిన ప్రముఖులు గంగాల నరేష్, శంభు ప్రశాంత్, వినోద, తేజస్విని, నాగరాజు, శ్రీధర్‌గౌడ్ తదితరులకు మెమొంటో అందించి శాలువాతో సన్మానించారు.

అర్చకుల వేతనాలు విడుదల చేయండి

గజ్వేల్‌రూరల్: పెండింగ్‌లో ఉన్న అర్చకుల వేతనాలు వెంటనే విడుదల చేయాలని ధూప దీప నైవేద్య అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు చాడ నందబాలశర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శేషం శ్రీనివాసాచార్యులు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం పట్టణంలోని సత్యసాయి మందిరం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 500 మంది వరకు అర్చకులు అర్చక వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. దైవార్చనే వృత్తిగా కొనసాగిస్తూ జీవనోపాధి పొందుతున్న వారికి వేతనాలు పెండింగ్‌లో ఉండడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ విషయమై స్పందించాలన్నారు. ఉద్యోగ భద్రత, గుర్తింపు కార్డులు, వేతనాల పెంపు హామీని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అర్చక సంఘం సభ్యులు వీరభద్రయ్య, రాజమనోహరశర్మ, మురళీశర్మ, విఠల సాయికృష్ణ, శంకరశర్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన డివిజన్ బ్రాహ్మణ సంఘం సేవా సమాఖ్య సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీకాంత్‌రావులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రైతుబీమా డబ్బులు కాజేసిన కేసులో అరెస్టు

హవేళిఘణాపూర్(మెదక్): భర్త బతికుండగానే చనిపోయాడని నకిలీ ధ్రువపత్రాలతో రైతు బీమా నగదు కాజేసిన కేసులో ఓ వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు హవేళిఘణాపూర్ ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. బూర్గుపల్లికి చెందిన లెంక పద్మ తన భర్త మల్లేశం బతికి ఉండగానే చనిపోయాడని ధ్రువపత్రాలు సృష్టించి రైతుబీమా డబ్బులు కాజేసిన విషయం విదితమే. ఈ కేసు విచారణలో ఇదే గ్రామానికి చెందిన పోతగల్ల శ్రీనివాస్ బ్యాంకు ఖాతాకు రూ. లక్ష ట్రాన్స్‌ఫర్ చేసినట్లు గుర్తించారు. ఈ ఘటనలో తన తప్పు కూడా ఉందని ఒప్పుకోగా కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

హైనా దాడిలో 25 గొర్రెల మృతి



మద్దూరు(హుస్నాబాద్): హైనా దాడిలో 25 గొర్రెలు మృతిచెందాయి. ఈ సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్మాముల గ్రామానికి చెందిన చెట్కూరి ఇస్తారి, ధర్మారం గ్రామానికి చెందినగుడిసె కొమురయ్యలు గొర్రెల పెంపకం ద్వారా జీవనం సాగిస్తున్నారు. రోజూ మాదిరిగానే శనివారం రాత్రి గొర్రెలను కోష్టంలో తోలి ఇంటికి వచ్చారు. ఆదివారం ఉదయం వెళ్లి చూడగా ఇస్తారికి చెందిన 14, కొమురయ్యకు చెందిన 11 గొర్రెలు హైనా దాడిలో మృతిచెందాయి. మరో నాలుగు గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. దాదాపు రూ. లక్ష వరకు నష్ట వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు. సంఘటన స్థలాని పశువైద్యాధికారి, ఫారెస్టు అధికారులు సందర్శించారు.

సాగు వినూత్నం.. లాభాలు అధికం

మూసధోరణి వ్యవసాయానికి చెక్ పెడుతున్నారు ఉమ్మడి మెదక్ జిల్లా రైతులు. సాంకేతికతను అందిపుచ్చుకుని అదరహో అనిపిస్తున్నారు. పంటమార్పిడిలో భాగంగా కూరగాయాలు, పండ్ల తోటల సాగుపై దృష్టి సారిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జిస్తున్నారు. తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. కూరగాయలు, పండ్ల సాగు చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు కుప్పానగర్ గ్రామానికి చెందిన రైతు మహబూబ్.. సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తూ మన్ననలు పొందుతున్నారు వెల్దుర్తి గ్రామానికి చెందిన తోట నర్సింహులు. పందిరి సాగులో చేతి నిండా సంపాదనకు కొదవ ఉండదని చాటుతున్నారు రైతు వరలక్ష్మి చెన్నయ్య. ఇలా వినూత్నమైన, ఆధునిక పద్ధతలతో సాగు చేస్తున్న కొందరి రైతన్నల కథనాలు మీ కోసం..

● పంట మార్పిడికే ప్రాధాన్యం ● ఆధునిక పద్ధతులతో ముందుకు ● ఆదర్శంగా నిలుస్తున్న రైతులు


తూప్రాన్ : మల్కాపూర్‌లో రైతు సాగు చేసిన బీర పంట

ఆలోచనే మార్పు తెచ్చింది



ఝరాసంగం(జహీరాబాద్): వాణిజ్య పంటలైన చెరుకు పత్తి సాగు చేసి విసిగిపోయిన రైతు కొన్ని సంవత్సరాలుగా కూరగాయలతో పాటు పండ్ల సాగుపై దృష్టి సారించాడు. మండలంలోని కుప్పానగర్ గ్రామానికి చెందిన మహబూబ్ అనే రైతు తనకు ఉన్న మూడు ఎకరాల సొంత పొలంతో పాటు మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్నాడు. వాణిజ్య పంటలు సాగు చేసిన సమయంలో పెట్టుబడులతో పాటు కూలీల కొరత సైతం ఉండేది. లాభాలు కూడా అంతగా చూడలేకపోయానని పేర్కొన్నాడు. దీంతో తనకు వచ్చిన ఆలోచనలతో పాలకూర, మెంతి కూర, కొత్తిమీర, తోటకూర, బీరకాయ, టమాటతో పాటు పొప్పడి పండు పంట సాగు చేస్తున్నాడు. కూరగాయల సాగులో తక్కువ పెట్టుబడి తో పాటు తక్కువ సమయంలో పంట చేతికి వస్తుంది. మంచి ధర ఉంటే మంచి లాభాలు సైతం వస్తాయి. నష్టం మాత్రం ఇప్పటివరకు రాలేదని అంటున్నాడు. పొప్పడి పండు సాగులో సైతం ఒకసారి పెట్టుబడి పెడితే మూడు సంవత్సరాల వరకు పంట దిగుబడి వస్తుంది. సుమారు ఆరు సంవత్సరాలుగా ఈ రకం పంటలు సాగు చేస్తున్నాడు. అంతేకాకుండా మార్కెట్‌కు తరలించకుండా రోడ్డు పక్కనే పొలం ఉండడంతో చిన్న షెడ్డుగా ఏర్పాటు చేసుకొని కుటుంబ సభ్యులతో కలిసి విక్రయిస్తున్నాడు.

సిరుల 'పందిరి'



తూప్రాన్: మెదక్ జిల్లా తూప్రాన్ మండలం మల్కాపూర్‌లో రైతులు ఆధునిక వ్యవసాయం, కూరగాయల సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఉద్యానశాఖ అధికారుల ప్రోత్సాహంతో పందిరి సాగు కింద కాకర, బీర, సోర పంటలను సాగు చేస్తున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జిస్తున్నారు. పంటల సాగు విషయంలో ఆధునిక పద్ధతులను అందిపుచ్చుకొని మొద్దలకు చీడపీడల ఆశించకుండా మల్చింగ్ పద్ధతిని ఎంచుకున్నారు. డ్రిప్ విధానంతో నిరందిస్తున్నారు. రెండు మీటర్ల వెడల్పుతో పందిళ్లు వేసి కూరగాయల పంటలు సాగు చేస్తున్నారు. కొన్నేళ్లగా సాగు చేస్తూ మంచి దిగుబడులు సాధిస్తున్నారు. పెట్టుబడి ఖర్చులు పోను లాభాలు ఆర్జిస్తున్నారు. దిగుబడిని మేడ్చల్ జిల్లా అస్మాన్‌పేటలోని రైతు బజారుకు, ములుగు మండలం వంటి మామిడి మార్కెట్‌తో పాటు తూప్రాన్‌లో వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం కాకర, బీర కిలో రూ.30 నుంచి రూ.45 వరకు ధర పలుకుతుంది రైతులు తెలిపారు. దీంతో నెలకు రూ.50 వేలకు పైగా ఆదాయం పొందుతున్నారు.

డ్రోన్‌తో పిచికారీ

ప్రధాన మంత్రి చేపట్టిన నమో డ్రోన్ దీదీ కార్యక్రమం ద్వారా జిల్లాలోని మల్కాపూర్‌కు చెందిన మహిళా రైతు పిట్ల వరలక్ష్మిని ఎంపిక చేశారు. ఈ డ్రోన్ సహాయంతో పంట చీడపీడలు నివారించేందుకు ఈ సంవత్సరం నుంచి ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వరలక్ష్మి చెన్నయ్య మాట్లాడారు. ''గ్రామంలో ఆరు ఎకరాల పంట పొలం ఉంది. మూడు ఎకరాల్లో పందిరి సాగు ద్వారా గత ఐదేళ్లగా కాకర, బీర, సోర పంటలను సాగు చేస్తున్నా. రెండు ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నా. మరో ఎకరంలో క్యాబేజీ, వంకాయ పంటలు సాగు చేస్తున్నా. ఏడాదిలో రెండు పంటలు సాగు చేయవచ్చు. మూడు ఎకరాల పందిరి సాగుకు పెట్టుబడి సుమారు రూ.4లక్షలు. ఆరు నెలలకు రెట్టింపు లాభాలు వస్తున్నాయి. పందిరి సాగు ద్వారా పండించిన కూరగాయలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. అధిక ధర పలుకుతున్నాయి. మంచి లాభాలు వస్తున్నాయి అని తెలిపారు.


డ్రోన్‌తో పిచికారీ చేస్తున్న రైతు వరలక్ష్మి చెన్నయ్య దంపతులు

ఆర్గానిక్ సాగు ఆరోగ్యానికి మేలు



వెల్దుర్తి(తూప్రాన్): మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రానికి చెందిన రైతు, రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ సభ్యుడు తోట నర్సింహులు సేంద్రియ వ్యవసాయం అవలంబిస్తూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. తనకున్న ఎనిమిది ఎకరాల్లో పశువుల వ్యర్థాలు, స్థానికంగా లభించే వనరులు, తక్కువ పెట్టుబడితో రసాయన ఎరువుల జోలికి వెళ్లకుండా సేంద్రియ విధానంలో వరి పంటతో పాటు ఆరుతడి పంటలు పండిస్తూ అధిక దిగుబడులను గడిస్తున్నారు. రసాయనిక ఎరువుల వాడకంతో భూమి సారవంతం కోల్పోవడంతో పాటు అనారోగ్య సమస్యలు అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున తనకున్న భూమిలో తక్కువ పెట్టుబడితో అధికలాభాలు సాధించేలా ఆర్గానిక్ సాగు చేస్తున్నట్లు రైతు నర్సింహులు తెలిపారు. పంట దిగుబడి తక్కువగా వచ్చినా మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువగా ఉండడంతో రేట్లు అధికంగా పలుకుతుండడంతో అనుకున్న దానికంటే ఎక్కువగానే లాభాలు వస్తున్నాయన్నారు.

ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాం

కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్
- కొండపోచమ్మసాగర్ ఘటనపై మంత్రి ఉత్తమ్‌తో చర్చ
- ప్రాజెక్టును సందర్శించిన నేతల బృందం


ఫోన్‌లో మంత్రి ఉత్తమ్‌తో మాట్లాడుతున్న కాంగ్రెస్ సీనియర్ నేత హనుమంతరావు

మర్కూక్(గజ్వేల్): కొండపోచమ్మ సాగర్‌పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి హామీ ఇచ్చారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు వీహెచ్ హనుమంతరావు తెలిపారు. ఎలాంటి బందోబస్తు, నిఘా లేకపోవడంతోనే ఐదుగురు మృత్యువాత పడిన ఘటన చోటుచేసుకుందన్నారు. వెంటనే ఈ ప్రాంతంలో ఐదుగురు గజఈతగాళ్లు, పోలీస్ సిబ్బందిని సాగర్‌పై నియమించాలని కోరినట్లు తెలిపారు. ఆదివారం ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్‌లతో కలిసి ఆయన కొండపోచమ్మసాగర్‌ను ఆదివారం సందర్శించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించారు. యువకులు సాగర్‌లోకి ఎలా వెళ్లారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. వారి మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం మంత్రి ఉత్తమ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. కొండపోచమ్మ సాగర్ వద్ద జరిగిన ఘటనపై చర్చించారు. మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించేలా సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి న్యాయం చేస్తామని తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కనకయ్యగౌడ్, ఉపాధ్యక్షుడు యాదగిరి, నాయకులు నర్సింహులు, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఏడుపాయలలో భక్తుల సందడి


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వనదుర్గా భవాని ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వారు అమ్మవారిని దర్శించుకున్నారు. బోనాలు తీసి, ఒడి బియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ ఈఓ చంద్రశేఖర్, సిబ్బంది, పోలీస్‌లు చర్యలు తీసుకున్నారు. యాదాద్రి జిల్లా విద్యాధికారి కంగుల సత్యనారాయణ కుటుంబ సమేతంగా దుర్గమ్మను దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ సిబ్బంది స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు అందజేశారు.


దుర్గమ్మ సన్నిధిలో యాదాద్రి డీఈఓ సత్యనారాయణ

మైనింగ్‌పై విచారణ చేపట్టాల్సిందే

కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిరెడ్డి


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేటరూరల్: బీఆర్‌ఎస్ పాలనలో ఇర్కోడ్ గ్రామంలో చేపట్టిన మైనింగ్, అభివృద్ధి కార్యక్రమాల పేరిట పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ ఈ విషయమై విచారణ జరిపించాలని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బుచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ఇర్కోడ్‌లో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మల్లారెడ్డి ఆధ్వర్యంలో విలేఖరుల సమావేశం ఏర్పాటు నిర్వహించి జిల్లా ఉపాధ్యక్షుడు మందపాడుతో కలిసి ఆయన మాట్లాడారు. పదేళ్లలో అనేక రకాలుగా పేదల డబ్బులను బీఆర్‌ఎస్ నాయకులు దండుకున్నారన్నారు. ఈ క్రమంలో ఇర్కోడ్‌లోని దేవాలయ భూములను, ప్రభుత్వ భూములను తనకు నచ్చిన వారికి కేటాయించడం సమంజసమా? అని సుడా మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డిని ప్రశ్నించారు. ఈ విషయమై పూర్తి ఆధారాలతో బయటపెట్టనున్నామన్నారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఇళ్లు కోల్పోతున్న వారికి కాంగ్రెస్ కృషితో లబ్ధిదారులకు చెక్కులు అందించామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు సదాశివారెడ్డి, నాయకులు కృష్టారెడ్డి, మహిపాల్‌రెడ్డి, కిషన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రెండు చోట్ల దారుణ హత్యలు

సంగారెడ్డి, అందోల్‌లో ఘటనలు


సంగారెడ్డి క్రైమ్: సమీర్ మృతదేహం

సంగారెడ్డి క్రైమ్: చేయని నేరానికి కేసులో ఇరికించాలనే కక్షతో గొంతు కోసి యువకుడిని దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన ఆలస్యంగా సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం... మహారాష్ట్రకు చెందిన షేక్ సమీర్ అలియాస్ అమలు (27) 2018లో బతుకుదెరువు కోసం మహారాష్ట్ర నుంచి సంగారెడ్డికి వలసవచ్చాడు. డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శివాజీ నగర్‌కు చెందిన మస్రత్ అనిషాను వివాహం చేసుకున్నాడు. శాంతినగర్‌లో కుటుంబంతో కలిసి అతను నివాసం ఉంటున్నాడు. సమీర్ పలు దొంగతనాలకు సైతం పాల్పడగా సంగారెడ్డి పోలీస్ స్టేషన్‌లతో పాటు పటాన్‌చెరు, శంకరపల్లి తదితర స్టేషన్‌లలో కేసుల నమోదయ్యాయి. తనకు పరిచయం ఉన్న సంగారెడ్డిలోని ఇందిరా కాలనీకి చెందిన మహమ్మద్ యూసఫ్, అనీశ్‌లను ఓ కేసులో అతను ఇరికించాడని సమాచారం. దీంతో కక్ష పెంచుకున్న అనీశ్ శనివారం రాత్రి 10.40 గంటల ప్రాంతంలో స్థానిక అంబేద్కర్ గ్రౌండ్ వెనకాల అతడిని కత్తితో గొంతు కోసి చంపాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆ మేరకు సమీర్ భార్య మస్రత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. నిందితుల్లో ఒకరిని అరెస్ట్ చేయగా, మరొకరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

మరో యువకుడి ..


శ్రీనివాస్(ఫైల్)

వట్‌పల్లి(అందోల్): ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన అందోల్ మండలం తాలెల్మ రేణుక ఎల్లమ్మ గట్టుపై ఆదివారం చోటుచేసుకుంది. సీఐ అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నాదులాపూర్‌కు చెందిన కర్రోళ్ల శ్రీనివాస్ (25) రోజూ మాదిరిగానే శనివారం ఇంటి నుంచి వెళ్లి రాత్రయినా తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అతని సెల్‌ఫోన్‌కు కాల్ చేయగా స్విచ్‌ఆఫ్ వచ్చింది. తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం గ్రామానికి చెందిన పశువుల కాపరులు.. ఎల్లమ్మ గట్టుపై ఒక వ్యక్తి రక్తపు మడుగులో పడి మృతిచెందాడని గమనించారు. వెంటనే పోలీసులకు, గ్రామస్తులకు సమాచారం అందజేశారు. సంఘటన స్థలానికి ఎస్‌ఐ పాండు, వట్‌పల్లి ఎస్‌ఐ విఠల్ సిబ్బందితో కలిసి జోగిపేట సీఐ అనిల్‌కుమార్ చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు శ్రీనివాస్‌పై రాయితో దాడి చేసి, మద్యం సీసాను పగులగొట్టి గొంతు కోసి హత్య చేసినట్లుగా గుర్తించారు. వెంటనే క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను కూడా రప్పించగా ఆధారాలను సేకరిస్తోంది. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

న్యాల్‌కల్‌లో దొంగల బీభత్సం

- వైన్స్ షాపు వెనకగోడకు కన్నం
- రూ.20వేల నగదు, మద్యం సీసాల తస్కరణ
- ప్రభుత్వ కార్యాలయాల్లోనూ చోరీకి యత్నం

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్‌లో శనివారం అర్ధరాత్రి తర్వాత ఇద్దరు దొంగలు బీభత్సం సృష్టించారు. మెయిన్‌రోడ్డుకు పక్కనున్న వైన్స్ షాపులో చోరీ చేసి, పక్కనున్న ప్రభుత్వ కార్యాలయాల్లోను దొంగతనానికి యత్నించారు. వివరాలిలా ఉన్నాయి. రోజూ మాదిరిగానే శనివారం రాత్రి న్యాల్‌కల్‌లోని సిద్ధివినాయక వైన్స్ షాపును మూసేసి నిర్వాహకులు ఇంటికి వెళ్లిపోయారు. అర్ధరాత్రి ఇద్దరు దొంగలు వైన్స్ వెనకగుండా ఉన్న గోడకు కన్నం వేసి లోపలికి ప్రవేశించారు. గల్లా పెట్టెలో ఉన్న రూ.20వేలు నగదు, ముందుభాగంలో ఉన్న మద్యం సీసాలను ఎత్తుకెళ్లారు. సీసీ కెమెరాల బాక్స్‌ను తొలగించారు. అనంతరం ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలకు వేసిన తాళాలు పగులగొట్టి లోపలికి చొరబడ్డారు. బీరువాలు పగులగొట్టి డబ్బులు లేకపోవడంతో ఉడాయించారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీడీఓ రాజశేఖర్, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఉదయం కార్యాలయాలకు చేరుకున్నారు. రికార్డులు, కంప్యూటర్ల జోలికి గాని వెళ్లకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న జహీరాబాద్ రూరల్ సీఐ జెక్కుల హన్మంత్, హద్నూర్ ఎస్సై రాజశేఖర్ .. వైన్స్ షాపు, కార్యాలయాల వద్దకు చేరుకున్నారు. వైన్స్ నిర్వాహకులు, అధికారులను ఈ విషయమై ఆరాతీశారు. వైన్స్‌లో గల సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించారు. వైన్స్‌లోకి ఇద్దరు వచ్చి డబ్బులు దొంగిలించడం, మద్యం సీసాలను ఎత్తుకెళ్లిన దృశ్యాలు సీసీఫుటేజీలో కనిపించాయి. అనంతరం క్లూస్ టీమ్స్ వారు కూడా వచ్చి నమూనాలను సేకరించారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


క్యాష్ కౌంటర్ వద్ద చోరీ చేస్తున్న వ్యక్తి సీసీ ఫుటేజీ

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు రింగ్‌రోడ్డును అనుకొని ఉన్న సర్వీస్ రోడ్డుపై ఈనెల 6వ తేదీ రాత్రి గుర్తు తెలియని వ్యక్తి నడుకుంటూ వెళ్తున్నాడు. ఈ సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయలపాలైన అతడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. అతడి వివరాలు ఎవరికైనా తెలిస్తే తమను సంప్రదించాలని సూచించారు.

'మిస్టర్ సిద్దిపేట' విజేత ఆసిఫ్

సిద్దిపేటజోన్: 'మిస్టర్ సిద్దిపేట' ఓవరాల్ విజేతగా సిద్దిపేట వాసి అయిన ఆసిఫ్ నిలిచాడు. స్థానిక విపంచి ఆడిటోరియంలో సిద్దిపేట జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మిస్టర్ సిద్దిపేట–2025 పోటీలు నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన వారు హాజరయ్యారు. వివిధ కేటగిరీలుగా పోటీలు జరిగాయి. ఓవరాల్‌గా ఆసిఫ్ టైటిల్ సాధించారు. అసోసియేషన్ అధ్యక్షుడు సంపత్ రెడ్డి, కౌన్సిలర్ బ్రమ్మంలు పోటీలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మిస్టర్ సిద్దిపేటగా నిలిచిన ఆసిఫ్ మాట్లాడుతూ, టైటిల్ సాధన కోసం నిరంతరం జిమ్‌లో కష్టపడినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో టైటిల్ సాధన దిశగా ప్రయత్నాలు చేస్తానని పేర్కొన్నారు.


విజేతగా నిలిచిన ఆసిఫ్


బాడీ బిల్డింగ్ ప్రదర్శన చేస్తున్న యువకులు

సాగునీరును అందించండి

- రైతుల గోస పట్టని సర్కారు
- ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి


లింగాపూర్‌లో కాలువను పరిశీలించిన ప్రభాకర్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): మల్లన్న సాగర్ నుంచి సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని లింగాపూర్‌లో ప్రాజెక్టు కాలువను రైతులతో కలిసి ఆయన ఆదివారం పరిశీలించారు. రైతు ప్రభుత్వం అంటూ గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ కర్షకులనే మోసం చేస్తోందన్నారు. ఈ కాలువ ద్వారా లింగాపూర్ నుంచి బంజేరుపల్లి, వెంకట్రావుపేట, చెప్యాల, దొమ్మాట, సూరంపల్లి తదితర గ్రామాల వారికి మేలు జరుగుతుందన్నారు. కాంగ్రెస్ అధికాంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా కొత్త కాలువలు తీయడం లేదన్నారు. మల్లన్న సాగర్ నుంచి సాగు నీటిని విడుదల చేసి నియోజకవర్గంలోని చెరువులు, చెక్‌డ్యాంలు నింపాలన్నారు. అసంపూర్తిగా ఉన్న కాలువలను పూర్తిచేయాలని కోరారు. అంతకుముందు మండలంలోని జప్తి లింగారెడ్డిపల్లిలో శ్రీ సంగాల మల్లన్న స్వామిని ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎస్సీ ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యలతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఎల్లారెడ్డిపేట పెద్దగుట్ట దర్గ ఉర్సు ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

క్రికెట్ ఆడిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డిలో నిర్వహిస్తున్న ఉమ్మడి మండల క్రికెట్ టోర్నీలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆదివారం క్రికెట్ ఆడి సందడి చేశారు. కాసేపు బ్యాట్‌పట్టి యువతను ఉత్సాహపరిచారు. ఆయన వెంట ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ వెంకటయ్య, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు సతీశ్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, మాజీ కో ఆప్షన్ మెంబర్ ఎండీ. అహ్మద్, నైపుణ్య ఆర్గనైజేషన్ చైర్మన్ మొగుళ్ల ఐలయ్య, యాదాకృష్ణ పాల్గొన్నారు.